క్యాన్సర్ నిర్ధారణ సులభతరం

- స్క్రీనింగ్ పరీక్షలకు వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం
- ఇంటి వద్దనే క్యాన్సర్ నిర్ధారణ
- ఇంటింటి సర్వేతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు
- నియోజకవర్గ వ్యాప్తంగా 2,32,095 మందికి పరీక్షలు



బెల్లంకొండలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బెల్లంకొండ: క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక స్థాయిలో గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. పూర్వపు సర్వేల ద్వారా క్యాన్సర్ వ్యాప్తిని గుర్తించడం ఆలస్యం అవుతుండడంతో సోకినవారు మరణాలకు గురవుతున్నారు. కాగా జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా 'క్యాన్సర్‌పై విజయం–స్క్రీనింగ్‌తో సాధ్యం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 14 నుంచి ఇంటింటి సర్వే ద్వారా ఇంటి వద్ద 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి స్థానిక ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలను చేపట్టారు. ప్రత్యేక స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్ లక్షణాలను గుర్తించనున్నట్లు వైద్య అధికారులు చెప్తున్నారు. దీనికోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు.

ప్రాథమిక దశలోనే గుర్తింపు..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం క్యాన్సర్, దాని ప్రారంభం చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నట్లు వెల్లడైంది. ఒక వ్యక్తిలో ఏదైనా లక్షణం కనిపించక ముందే క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే 'క్యాన్సర్ స్క్రీనింగ్' అని పిలుస్తారు. ప్రాథమిక దశలోనే వ్యాధి కణాలను గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితుల మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు అవకాశం ఉంది.

ప్రత్యేక యాప్..

క్యాన్సర్ లక్షణాలు ప్రాథమిక స్థాయిలో గుర్తించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఈ యాప్‌ను ఉపయోగించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. మహిళల్లో ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ల బారిన పడుతున్నారు. ఈ స్క్రీనింగ్ పరీక్షలలో మహిళల ఆరోగ్య సమస్యలను నమోదు చేయనున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి దంతక్షయాల సమస్యలు, మహిళలకు సంబంధించిన నెలసరి సమస్యలను నమోదు చేస్తారు. తద్వారా క్యాన్సర్ ప్రాథమిక దశను అంచనా వేస్తారు.

నియోజకవర్గ వ్యాప్తంగా..

పెదరకూరపాడు నియోజగవర్గ వ్యాప్తంగా 18 ఏళ్లకు పైబడిన వారు అధికారిక లెక్కల ప్రకారం 2,32,095 మంది వరకూ ఉన్నారు. బెల్లంకొండ మండలంలో 26,956, అచ్చంపేటలో 53,263, క్రోసూరులో 50,524 మంది, పెలకూరపాడులో 42,219 మంది, అమరావతిలో 59,133 మంది ఉన్నారు. వీరందరికీ స్థానికంగా ఉన్న పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యా ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 14 నుంచి డిసెంబర్ నెల ఆఖరి వరకు స్క్రీనింగ్ పరీక్షల కార్యక్రమం జరుగుతుంది. ప్రాథమిక లక్షణాలను గుర్తించిన వారిని స్థానిక వైద్యులు రిఫర్ చేస్తూ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసి ప్రత్యేక క్యాన్సర్ వైద్య శిబిరాలకు పంపించనున్నారు.

స్క్రీనింగ్ పరీక్షలతో మేలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. మహిళల్లో ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు కనిపించకుండా ఉంటాయి. వారికి ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ఇప్పటికే అన్ని పీహెచ్‌సీలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

– డాక్టర్ కె.వి.కోటేశ్వరరావు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చంద్రాజుపాలెం

క్లుప్తంగా

కేజీబీవీలో అభ్యాసన సామర్థ్య పరీక్ష



క్రోసూరు: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంను సోమవారం ఎంఈవో–2 ఎం.గణేష్ సందర్శించారు. విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించారు. ఆరు నుంచి 9వ విద్యార్థులకు డిక్టేషన్ టెస్ట్, 10 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పంచతంత్ర టెస్ట్ నిర్వహించారు. పరీక్ష ఫలితాలు పరిశీలించిన ఎంఈవో సంతృప్తి వ్యక్తపరిచారు. మరింత బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం



అచ్చంపేట: కార్తిక మాసం సందర్భంగా స్థానిక షిర్డి సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగాలకు అభిషేకాలు, అర్చనలు, బిళ్వ పూజలు చేశారు. ఏకాదశ రుద్రాభిషేకాలు, నమకం చమకం అర్చనలను ఆలయ పూజారులు నిర్వహించారు. ఓం నమఃశివాయ..హర హర మహాదేవ శంభో శంకర.. నినాదాలు మిన్నంటాయి. భక్తిభావంతో కార్తీక దీపాలు వెలిగించారు. పిడుగురాళ్ల ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త నందిపాటి రవీంద్రకుమార్ ఆచార్యుల ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

గ్రోమోర్ కేంద్రంలో తనిఖీలు



నకరికల్లు: రికార్డుల నిర్వహణలో లోపాలుంటే సహించబోమని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు డీలర్లను హెచ్చరించారు. స్థానిక గ్రోమోర్ కేంద్రంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గోడౌన్‌లోని స్టాకును పరిశీలించారు. స్టాకు రికార్డులు, రశీదు పుస్తకాలు తనిఖీ చేశారు. పురుగు మందులు, ఎరువుల నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులు, ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల నిల్వల నుంచి మూడు రకాల నమూనాలు సేకరించి, నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అమరావతి: మండల పరిధిలోని దిడుగు సమీపం పవర్ ప్లాంట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్చంపేట మండలం కొండూరు గ్రామానికి చెందిన కుంబా శ్రీను(45) అనే వ్యక్తి సోమవారం మరణించాడు. పోలీసుల సమాచారం మేరకు.. శ్రీను తన అత్త అంత్యక్రియల్లో పాల్గొనేందుకు గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. పవర్ ప్లాంట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం అతనిని ఢీకొట్టింది. స్థానిక రైతు కూలీలు గమనించి క్షతగాత్రుడిని అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. శ్రీను చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాల భిక్షాటకులకు కౌన్సెలింగ్



అమరావతి: స్థానిక అమరేశ్వరస్వామి దేవస్థానం వద్ద భిక్షాటన చేస్తున్న ఐదుగురు బాలలకు బాల కార్మిక శాఖ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అందులో ఇద్దరు పిల్లలు ప్రమాదకర రసాయనాలతో కూడిన రంగుల ఒంటికి పూసుకుని భిక్షమెత్తుకుంటున్నట్లు గుర్తించారు. కార్తిక మాసంలో సుమారు 20 మంది బాలురు, బాలికలు ఈ విధంగా అడుక్కుంటున్నారు. దీంతో సోమవారం గుంటూరు నుంచి బాల కార్మిక శాఖ అధికారులు ఐదుగురిని అందుపులోకి తీసకుని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు.

దళిత యువకులపై అక్రమ కేసులు రద్దు చేయాలి

పెదకూరపాడులో బాధితుల భారీ ర్యాలీ



పెదకూరపాడు బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న లగడపాటి గ్రామస్తులు

పెదకూరపాడు : మండలంలో లగడపాడు దళిత యువకులపై అదే గ్రామానికి చెందిన రావెల బుచ్చయ్య చౌదరి, మనేష్ సెప్టెంబర్ 12న పెదకూరపాడు పోలీసుస్టేషన్ లో పెట్టిన అక్రమ కేసును రద్దు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట బాధితులతో కలసి ధర్నా చేశారు. బస్టాండ్ వద్ద ధర్నా ప్రారంభించి, ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం చేరుకున్నారు. ఈ సందర్భంగా కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ అగ్రకుల పెత్తందారి శక్తుల, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు.. రావెల బుచ్చయ్య చౌదరి, మనేష్ దళిత యువకులపై పెట్టిన అక్రమ కేసును రద్దు చేయకుండా రెండు నెలలుగా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కూడా నిందితులకే అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి 17 మంది దళిత యువకులపై రావెల బుచ్చయ్య చౌదరి పెట్టిన అక్రమ కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు దానేల్‌కు వినతి పత్రం అందజేశారు. సత్వరమే సమస్యకు పరిష్కారం చూపాలని లేకుంటే లగడపాడు దళిత వాడలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అప్పుడు ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా కలెక్టర్, ఎస్పీలే బాధ్యత వహించాలన్నారు. కేఎన్‌పీఎస్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు గొల్లపూడి చిన్న ప్రసాద్, నన్నం పోతురాజు, సీహెచ్ రాజశేఖర్, బయ్యవరపు రామయ్య, నాగి పోగు శ్రీనివాసరావు, సుజాత, మాలపాటి పాములు, దాసరి మోహన్ రావు, అంబడిపూడి అంథోని, మాలపాటి జానేష, పెయ్యల బ్రహ్మయ్య, దాసరి వెంకటేశ్వర్లు, తురకా ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

ముప్పాళ్ళ: మండలంలో మంగళవారం నుంచి 8 రోజుల పాటు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పీజే విలియమ్స్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19, 20 చాగంటివారిపాలెం, మాదల–1, 21, 22న ముప్పాళ్ళ, మాదల–2, దమ్మాలపాడు గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో, రెండో విడత 26న నార్నెపాడు, బొల్లవరం, 27న లంకెలకూరపాడు, రుద్రవరం, 28న తొండపి, గోళ్లపాడు, 29న ఇరుకుపాలెం, పలుదేవర్లపాడు గ్రామ సచివాలయాల్లో క్యాంపులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు, బయోమెట్రిక్ అప్‌డేషన్ చేయించుకోవచ్చని తెలిపారు.

నేటి నుంచి సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి: పట్టణంలో మంగళవారం నుంచి 22వ తేదీ వరకు, 26 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు సుగాలీ కాలనీ జెడ్పీ పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, 20న కృష్ణవేణి, ఎస్వీఆర్ కళాశాలలు, 21న రంగా కాలనీ సచివాలయం, వెంకటపతి నగర్ సచివాలయం, 22న రెండవ వార్డ్ అంగన్వాడీ స్కూల్, 15వ వార్డు అంగన్వాడి స్కూల్, 26న అమరావతి స్కూల్, లిటిల్ ఏంజెల్స్ స్కూల్, 27న వేద జూనియర్ కళాశాల, ప్రగతి డిగ్రీ కళాశాలు, 28న క్రిస్టియన్ పేట సచివాలయం, ఎన్జీవో హోం సెంటర్ సచివాలయం, 29న 8వ వార్డు అంగన్వాడీ స్కూల్, 13వ వార్డు అంగన్వాడీల్లో అలాగే అన్ని రోజులు టీటీడీ కల్యాణ మండప సచావాలయంలో ప్రత్యేక క్యాంపులు జరుగుతాయన్నారు.

సత్తెనపల్లి: ప్రత్యేక ఆధార్ క్యాంపులు సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలో ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. 19 నుంచి 22 వరకు భీమవరం, బృగుబండ గ్రామ సచివాలయాల్లో జరుగుతాయని పేర్కొన్నారు.

బెల్లంకొండ: ఎంపీడీవో వై.హనుమారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో గ్రామాల వారీగా క్యాంపుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 19, 20 తేదీల్లో బెల్లంకొండ, 21, 22న న్యూచిట్యాల, 26న మాచాయపాలెం, 27, 28న పాపాయపాలెం, 29న మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



శివాలయంలో ధ్వజస్తంభానికి పూజలు

సత్తెనపల్లి: కార్తిక సోమవారం శైవనక్షత్రాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అచ్చంపేట రోడ్డులోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, గుంటూరు రోడ్డులోని సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పెద్దమక్కెనలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారు జామున మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముప్పాళ్ళ: మండలంలోని ఆలయాల్లో కార్తిక సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించారు. ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కిక్కిరిసిన ఆలయాలు

నకరికల్లు: కార్తిక సోమవారం పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ ఆలయాలు భక్తజనంతో కిక్కిరిశాయి. నర్సింగపాడు, చేజర్ల, దేచవరం, గుండ్లపల్లి, నకరికల్లు, కుంకలగుంట, కండ్లకుంట గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆయా ఆలయాల అర్చకులు స్వామివార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.

లాంఛనాలతో సీకే రావు అంత్యక్రియలు

అచ్చంపేట: విశ్రాంత ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి సీకేరావు(చల్లా కోటేశ్వరరావు) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాపట్ల సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సాజన్ టు పవన్ నేతృత్వంలోని ఆరుగురు ఎయిర్ ఫోర్స్ బృందం ఎయిర్‌ఫోర్స్ లాంఛనాలతో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. చిత్తూరు జిల్లా పుత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చల్లా జానికి మృతదేహానికి నివాళులర్పించారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య ప్రయోజనాలు

నకరికల్లు: ఆయుష్మాన్ భారత్‌తో గ్రామీణ పేదలకు ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీడీఓ జి.కాశయ్య పేర్కొన్నారు. ఐటీసీ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, ట్రైనర్ బొల్లయ్య, సెర్ప్ సంస్థ ప్రతినిధులు బొల్లయ్య, సతీష్, గురుప్రసాద్, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం జయప్రదానికి పిలుపు

అచ్చంపేట: జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావాన్ని జయప్రదం చేయాలని ప్రముఖ ప్రవచన కర్త నంపాటి రవీంద్రకుమార్ ఆచార్యులు పిలుపునిచ్చారు. స్థానిక భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర నలుమూలల నుంచి అనేకమంది నిష్ణుతులైన హైందవ ప్రముఖులు పాల్గొని, సందేశమిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరు కదలిరావాలని, సభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు జయనేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు.

ధూళిపాళ్లలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

క్రోసూరు: సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని విజయ చైతన్య ఎంటర్ ప్రైజెస్ (రాయినీ కాటన్ మిల్లు)లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు క్రోసూరు ఏఎంసీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి కె.ఈశ్వరరావు సోమవారం తెలిపారు. అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ రైతులు ఇక్కడ పత్తి విక్రయించుకోవచ్చని చెప్పారు. తేమ 12 శాతానికి మించని పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7,121 నుంచి రూ.7,521 వరకు ఉందని పేర్కొన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రానికి లూజు లేదా గన్నీ బ్యాగుల్లో పత్తిని తీసుకురావాలని, ముందుగా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

రాజుపాలెం: బాల్య వివాహాలను అరికట్టాలని దళిత బహుజన రిసోర్స్ ఏరియా కో–ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం తెలిపారు. మండలంలోని గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. బాల్య వివాలమాలను ప్రతీ ఒక్కరూ అడ్డుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం సుగుణ మణిమ్మ, పీడీ రమణ పాల్గొన్నారు.

ఎరువులు నిత్యం అందుబాటులో ఉంచాలి

బెల్లంకొండ: రైతులకు నిత్యం ఎరువులన్నీ సరిపడా అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య తెలిపారు. సోమవారం నాగిరెడ్డిపాలెంలోని జీడీసీఎంఎస్‌లో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. కేంద్రంలో కొనుగోలు, అమ్మకం బిల్లులను పరిశీలించారు. నాణ్యత పరీక్షల కోసం మూడు రకాల ఎరువుల నమూనాలను సేకరించారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు విధిగా బిల్లు ఇవ్వాలని, బిల్లుపై రైతు, డీలర్ సంతకం ఉండాలన్నారు. ఎరువుల నిల్వ ధరల పట్టిక క్రమం తప్పక రాయాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి: మండలంలోని కట్టావారి పాలెంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో ఉన్న శివాలయం సెంటర్‌లో అయ్యప్ప స్వామి తృతీయ మండల పూజా మహోత్సవం సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుంటూరు శ్రీనివాసన్ నాయర్ గురుస్వామి, నరసరావుపేట డప్పు శ్రీను గురుస్వామి, మచిలీపట్నం పెదన బాలాజీ గురుస్వామి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. స్వాములకు భిక్ష అందించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరయ్యారు.

దీక్షా స్వాములకు వైద్య పరీక్షలు

బెల్లంకొండ: మండలంలోని మాల ధారణ చేపట్టిన దీక్షా స్వాములకు సోమవారం ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయంలో మండల ఆయుర్వేద వైద్యుడు ఆర్ శ్రీనివాస్ స్వాములకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపై, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య శిబిరంలో యోగా టీచర్ హనుమంతరావు నాయక్, గురుస్వాములు పాల్గొన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడొద్దు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థినులు ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. పట్టణంలోని వెంకటపతి కాలనీ ఎస్సీ సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహం విద్యార్థినులు ఆత్మహత్యకు యత్నించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన స్థానిక అధికారులతో కలిసి వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వసతి గృహంలో ఎలాంటి సమస్యలున్నా.. తమ దృష్టికి తీసుకురావాలన్నారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు పిల్లలు ఆత్మహత్య యత్నం చేయడం బాధాకరమన్నారు. వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థినుల సమస్యలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతో పాటు స్థానిక అధికారులు, సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.

బిక్కుబిక్కుమంటున్న విద్యార్థినులు

స్థానిక వెంకటపతి నగర్‌లోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు యత్నించడంతో మిగిలిన విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ భయాందోళన చెందుతున్నారు. ఆత్మహత్యాయత్నం ఘటనను తలుచుకుని భయపడుతున్నారు. విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉన్నప్పటికీ మిగిలిన విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా భయాందోళన చెందుతూ వారిని చూసేందుకు వస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పెదకూరపాడు: కవి బ్రహ్మ ఏటుకూరి వెంకట నరసయ్య కవితలు, రచనలు జన జాగృతికి ఉపయోగపడ్డాయని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజాకవి దర్శి శేషారావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వెంకట నరసయ్య 75వ వర్ధంతి సందర్భంగా జరిగిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు మెమెంటోలు, నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ పోటీలు పెదకూరపాడు అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 12న జరిగాయి. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాలరావు మాట్లాడుతూ ఏటుకూరి పెదకూరపాడుకు చెందిన వ్యక్తి కావడం గర్వకారణమన్నారు. ఆయన రచనలు సమాజాన్ని చైతన్య పరిచేవిగా ఉన్నాయన్నారు. ముఖ్య అతిథులు తహసీల్దార్ దానియేలు, సర్పంచ్ గుడిపూడి రాజు, రాంగోపాలరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానం జి.మ్యాగ్నిి (కాకతీయ స్కూల్), ద్వితీయ స్థానం కె.హేమంత్ సాయిరెడ్డి (జెడ్పీ హెచ్‌ఎస్ తాళ్లూరు), తృతీయ స్థానం ఎం.సాహిర (జెడ్పీహెచ్‌ఎస్ గారపాడు), కన్సోలేషన్ బహుమతులు టి.నవ్యశ్రీ, టి.ఇందు, టి.రూపశ్రీ, టి.లహరి, షేక్ ఆసిఫా అందుకున్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా కోటేశ్వరరావు వ్యవహరించారు. స్థానిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం రాధాకృష్ణ, ఉపాధ్యాయులు రాంబాబు, రాయపూడి సాంబశివరావు, నాగరాజు, నరేష, పీడీఎఫ్ ప్రతినిధులు కె.ప్రదీప్ కుమార్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు నిరసనగా వీఆర్‌ఏల ఆందోళన



నిరసన తెలుపుతున్న గ్రామ రెవెన్యూ సహాయకులు

పెదకూరపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా పెదకూరపాడు మండల గ్రామ రెవెన్యూ సహాయకులు నిరసన చేపట్టారు. గత రాత్రి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగీ సాహెబ్‌ను అన్యాయంగా అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఆందోళన చేపట్టారు. సోమవారం సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద జరిగే సామూహిక రాయబారం కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు అరెస్టులు చేసి రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో ఉంచడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా చేస్తున్న కార్యక్రమానికి అనుమతులు లేవంటూ పోలీసులు వీఆర్‌ఏలకు రాత్రి వేళ నోటీసులు ఇచ్చారు. అంతేకాకుండా జిల్లా అధ్యక్షుడి మీద అక్రమ కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ అక్రమ నిర్బంధాన్ని ఖండిస్తూ పెదకూరపాడు వీఆర్‌ఏలు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

క్రోసూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ పర్యవేక్షణలో హిందీ ఉపాధ్యాయులు షేక్ మహబూబ్ సూభాని క్విజ్ చేపట్టారు. ముఖ్య అతిథి బందారు మైసూరుబాబు పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయం ఏవిధంగా తోడ్పడుతుందో వివరించారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు సోమవారం నిర్వహించారు. నవోదయ, జెడ్పీ, ఎస్‌ఎఫ్ఎస్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ మాస్టర్‌గా విశ్రాంతి లెక్చరర్ కె.మహేశ్వరరావు వ్యవహరించినట్లు గ్రంథాలయ అధికారి కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఉపాధ్యాయులు డి.ప్రసాద్, ఎస్ బాబు, వై.రాధాకృష్ణ పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రగతి, సరస్వతి శిశు మందిర్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు.